

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

ఓహోహో
ఖోయాఖోయా చాంద్
ఖులా ఆస్మాన్
ఆంఖోమే సారీ రాత్ జాయేగీ
తుం కో భీ కైసే నీంద్ ఆయేగీ?

అన్ని నిద్రరాని రాత్రిళ్లూ విషాదమయంకావు. కొన్ని రాత్రిళ్లు ఆనందంతో, ఉత్సాహంతో, ఎక్స్‌యిట్ మెంట్‌తో నిద్రరాదు. అలాంటి రాత్రి పాడే పాట ఇది. నాయకుడు, నాయిక అందమైన సిమ్లాలో రాత్రిపూట ఒంటరిగా ఉంటారు. మనసుకు నచ్చిన అమ్మాయితో, కొండలు ,కోనలు, సెలయేరు, పండు వెన్నెల, చల్లని రాత్రి ఒంటరిగా గడపటం యువకుడికి అందమైన కల. అలాంటి సందర్భంలో ఉత్సాహం, ఉద్వేగం, ఉత్తేజం ఉన్మత్తమైన ఆనందం కలిసి ఉక్కిరి బిక్కిరి చేస్తూంటే నిద్ర అన్న ఆలోచన రానే రాదు. వెన్నెల రాత్రి ఎగసిపడే అలల్లా ఆనందంతో ఎగసి పడుతుంది హృదయం. నిశ్చలంగా ఉండలేదు శరీరం. అలాంటి సందర్భంలోని పాట ఇది.

నటన ప్రదర్శించేందుకు సరైన అవకాశాలు లభించటం లేదని దేవ్ ఆనంద్ తన సోదరులతో కలసి స్వంత నిర్మాణ సంస్థ నవకేతన్‌ను స్థాపించాడు. మంచి గుర్తింపు పొందాడు. ముఖ్యంగా సోదరుడు విజయ్ ఆనంద్ స్క్రిప్టు, దర్శకత్వం బాధ్యతలు చేపట్టినప్పటినుంచీ దేవ్ ఆనంద్ అగ్రశ్రేణి నటుల జాబితాలోకి అవలీలగా చేరిపోయాడు. నవకేతన్ అగ్రశ్రేణి నిర్మాణ సంస్థగా ఎదిగింది. నవకేతన్ బ్యానర్‌పై నిర్మించిన తొమ్మిదవ సినిమా 'కాలా బజార్'.

'కాలాబజార్ ' కథ విలక్షణమైనది. ఉద్యోగం పోయి జీవిక కోసం 'చెడు' పనులకు (బ్లాక్‌మార్కెటింగ్) దిగజారిన రఘువీర్, 'అల్క' పరిచయంతో తప్పుదిద్దుకుని సరైన మార్గంలోకి రావటం, అల్కను వివాహమాడటం టూకీగా కథ.

మామూలుగా అనిపించే కథను అత్యంత ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా చెప్పి ప్రేక్షకులను అలరిచటంలో స్క్రిప్టు, ప్రధాన పాత్ర వహిస్తుంది. స్క్రిప్టు, దర్శకత్వం, ఎడిటింగ్‌లు ఉత్తమ స్థాయిలో సృజించటం విజయ్ ఆనంద్‌కు కొట్టిన పిండి. అయితే, విజయ్ ఆనంద్ ప్రత్యేకత పాటలకోసం సన్నివేశ సృష్టీకరణ, పాటల చిత్రీకరణ. ఎలాంటి సందర్భంలేని పాట చిత్రీకరణ కూడా అత్యంత ఆసక్తికరంగా, సమ్మోహనంగా చేయటంలో రాజ్‌కపూర్, బిమల్‌రాయ్‌ల సరసన సగర్వంగా నిలబడతాడు విజయ్ ఆనంద్.

సినిమా దృశ్య మాధ్యమం. నిశ్చల దృశ్యం ప్రేక్షకుడిని అలరించదు. ప్రేక్షకుడు తెరవైపు కళ్లప్పగించి చూడాలంటే తెరపై కదలికలు ఉండాలి.సినిమా చలనచిత్రం. చిన్న పిల్లలు, మాటలు రాని స్థాయిలో కూడా తెరపై కదలికలను, మారుతున్న దృశ్యాలను కళ్లప్పగించి చూస్తారు. 'టాం అండ్ జెర్రీ 'లాంటి కార్టూన్ సినిమాలు అందుకనే వయసుతో సంబంధం లేకుండా ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ఈ 'చలనం ' సిద్ధాంతాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్న వాడు విజయ్ ఆనంద్. అందుకే అతని పాటల చిత్రీకరణలో తెరపై కనబడే నటీనటుల కన్నా అవిశ్రాంతంగా కదిలే కెమెరా ప్రధాన పాత్ర పోషిస్తుంది నిశ్చలమైన దృశ్యాన్ని చలనశీలం చేసి ఆసక్తికరం చేస్తుంది దీనికి తోడు దృశ్యాన్ని

ఊహించిన విధానం, ఎడిటింగ్ దృశ్యం వేగాన్ని పెంచుతాయి.ఎందుకంటే విజయ్ ఆనంద్ పాట భావాన్ని గ్రహించి తెరపై దృష్య రూపంలో ప్రదర్శిస్తాడు. దాంతో ప్రతి పాట ఒక కథగా ఎదిగి సినిమాను దాటి ఎదుగుతుంది. విజయ్ ఆనంద్ చిత్రీకరించిన ఏ పాట అయినా ప్రేక్షకులు తన్మయులై. ఇన్వాల్వ్ అయి చూస్తారు. పదే పదే చూస్తారు. చూసిన ప్రతిసారీ పరవశిస్తారు. మళ్లీ చూస్తారు. 'ఖోయా ఖోయా చాంద్' పాట ఇందుకు భిన్నం కాదు. పైగా విజయ్ ఆనంద్ అత్యుత్తమ పాట చిత్రీకరణకు అత్యుత్తమ నిదర్శనంగా అగ్రస్థాయిలో నిలుస్తుంది.

విజయ్ ఆనంద్ ఏ సంగీత దర్శకుడితో పనిచేసినా అత్యుత్తమ స్థాయి పాటలు, అత్యంత ఆకర్షణీయమైనవి రాబట్టుకున్నాడు. నవకేతన్ ఆస్థాన సంగీత దర్శకుడు ఎస్డీబర్మన్. ఆరంభం నుంచీ అత్యంత ఆకర్షణీయమయిన ఉన్నత స్థాయి పాటలను అందించాడు. 'మునింజీ ' సినిమా తయారవుతున్న సమయంలో నవకేతన్ గేయ రచయిత సాహిర్ లూధియాన్వీకీ ఎస్డీ బర్మన్‌కూ నడుమ భేదాభిప్రాయాలు వచ్చాయి, 'మునింజీ' సినిమా పాటలు సగంలో వదిలి సాహిర్ వెళ్లిపోయాడు. ఆ స్థానాన్ని శైలేంద్ర భర్తీ చేశాడు. దాంతో 'కాలాబజార్' సినిమా కోసం తొలిసారి నవకేతన్ బ్యానర్ క్రింద శైలేంద్ర, ఎస్డీబర్మన్, దేవ్ ఆనంద్, విజయ్ ఆనంద్‌లు కలిశారు. భవిష్యత్తులో 'గైడ్' లాంటి పరమాద్భుతమైన సృజనకు నాందీ ప్రస్తావన జరిగింది.

శైలేంద్రను సాహిర్‌కు దీటైన గేయ రచయితగా భావిస్తారు. కానీ శైలేంద్రకూ సాహిర్‌కూ భావ వ్యక్తీకరణలో తేడా ఉంది. శైలేంద్ర అతి సరళమూ, తరళమూ అయిన పదాలను స్వచ్ఛమైన నీటి ప్రవాహంలా అనిపించే రీతిలో వాడతాడు. కవిత్వం అనిపించని రీతిలో అత్యున్నత స్థాయి దృశ్యాలను శ్రోత ఎదపై చిత్రిస్తాడు. సున్నితమైన భావాలకు హృదయంలో రెక్కలనిస్తాడు. సాహిర్ 'ఆహా' అనిపించే భావాలతో అలరింపచేస్తే, శైలేంద్ర 'ఓహ్' అనిపిస్తూ అలరిస్తాడు.

ఎస్డీ బర్మన్‌కి పాటలో భావం ప్రాధాన్యం. భావం ప్రస్ఫుటమవటం కోసం అతి తక్కువ వాయిద్యాలను అత్యంత సృజనాత్మకంగా వాడతాడు ఎస్డీబర్మన్. అతడికి హిందీ అంతగా రాదు. అందుకని హిందీ సాహిత్యంపై పట్టు ఉన్న వ్యక్తి తన అసిస్టెంట్‌గా ఉండాలని పట్టుబట్టి జయదేవ్‌ను అసిస్టెంట్‌గా తీసుకున్నాడు. జయదేవ్ వ్యక్తిగతంగా అత్యద్భుతమైన కళాకారుడు. 'ధ్వని' మర్మం తెలిసినవాడు. రాగాల ఆత్మను గ్రహించినవాడు. అందుకే జయదేవ్ అసిస్టెంట్‌గా ఉన్నప్పటి ఎస్డీబర్మన్ పాటలకూ, జయదేవ్ లేనప్పటి పాటలకూ తేడా స్పష్టంగా తెలుస్తుంది. ముఖ్యంగా వాయిద్యాల ధ్వనులతో భావనలకు రెక్కలనివ్వటం, దృశ్యాలను సజీవం చేయటం జయదేవ్ ప్రత్యేకత. అలాంటి జయదేవ్ 'కాలాబజార్' సినిమాలో ఎస్డీబర్మన్‌కు అసిస్టెంట్.

దేవ్ ఆనంద్ అప్పటికే తనకంటూ ఒక ఇమేజ్‌ని సృష్టించుకున్నాడు. కాలంతోపాటు కదులుతూ ఇమేజ్‌ని మార్చుకుంటూ దీర్ఘకాలం అగ్రశ్రేణి హీరోగా నిలచినవాడు దేవ్ ఆనంద్. అతనిలో దాగున్న కళాకారుడికి అతని సినిమాలు న్యాయం చేయలేదన్నది చేదు నిజం. కానీ తనదైన నటన పద్ధతిని, మానరిజంలను సృష్టించుకుని ప్రేక్షకులను అలరించాడు దేవ్ ఆనంద్. అతడికి ఎస్డీబర్మన్ తప్ప మరో సంగీత దర్శకుడు నచ్చడు. అందుకే, ఎస్డీ బర్మన్ మరణం తరువాత నవకేతన్‌కు సరైన సంగీత దర్శకుడు దొరకలేదు. నవకేతన్ సినిమాల్లో సరైన పాటలూ లేవు.

బ్లాక్‌లో టిక్కెట్లమ్మటం మానిన రఘువీర్, అల్క ఊటీ వెళ్తోందని తెలిసి తానూ వెళ్తాడు. ఇద్దరూ అలా వ్యాహాళికి వెళ్తారు. ఎదురుగా వెన్నెల్లో మెరిసే సెలయేటి నీరు, ఆకాశంలో నిండు పున్నమి జాబిల్లి. ఆకాశాన్ని తాకే చెట్లు చల్లని గాలికి తలలుపుతున్నాయి. దూరంగా కొండలు.. లోయలు, పచ్చిక మైదానాలు. అప్పటికి ఆల్క ఓ వ్యక్తిని ప్రేమిస్తుంది. అతడు విదేశానికి వెళ్తాడు. ఇది రఘువీర్‌కు తెలుసు కానీ ఆమె హృదయాన్ని గెలవాలని ప్రయత్నిస్తుంటాడు. తన ఎదలోని మాటను పాట ద్వారా ప్రకటిస్తాడు. ఇదీ పాట సందర్భం. ఈ సమయానికి నాయికకు నాయకుడి మీద ఎలాంటి ప్రేమ భావన కూడా ఉండదు.

సందర్భం వివరించి, తాను సృజించిన బాణీని వినిపించి గేయాన్ని రచించే బాధ్యత శైలేంద్రకు అప్పచెప్పాడు ఎస్డీ బర్మన్. శైలేంద్ర ఎంతకీ పల్లవిని ఇవ్వకపోవటంతో ఓ రోజు ఆర్డీబర్మన్‌ను ఆదేశించాడు. శైలేంద్రనించి పల్లవిని పట్టుకునే ఇంటికి రావాలి. దాంతో ఆ రోజు శైలేంద్ర ఎటు వెళ్తే అటు వెళ్తూ నీడలా వెంబడించాడు ఆర్డీబర్మన్. రాత్రి పదకొండు గంటలకు జుహూ బీచ్‌లో పచార్లు చేస్తూ, సిగరెట్ ఫాయిల్‌పై 'ఖోయా ఖోయా చాంద్ ' పల్లవిని సిగరెట్ నుసితో రాసిచ్చాడట శైలేంద్ర. అలా ఉద్భవించింది 'ఖోయా ఖోయా చాంద్ పాట' ఈ పాట విషయం ఎస్డీ బర్మన్ స్వయంగా రేడియో ఇంటర్వ్యూలో వెల్లడించాడు.

'ఖోయా ఖోయా చాంద్' పాటను భీమ్ పలాసీ రాగంలో రూపొందించాడు ఎస్డీబర్మన్. భీమ్ పలాసీ మృదువైన, భావాత్మకమైన రాగం. అనేకమైన సున్నిత భావనలను జనింపచేసే రాగం. సాయంత్రం పూట సూర్యాస్తమయం వేళ ఈ రాగాన్ని ఆలాపిస్తే అత్యధిక ప్రభావం ఉంటుందంటారు. ఈ రాగం వ్యక్తి లోలోపల నుంచి ప్రేమ భావనలను వెలికి తెస్తుంది. ముఖ్యంగా ప్రేయసి కోసం ప్రియుడు, ప్రియుడి కోసం ప్రేయసి తపనలను అతి చక్కగా ప్రదర్శిస్తుందీ రాగం. తనను ప్రేమిస్తోందో లేదో తెలియని ప్రేయసికి తన తీవ్రమైన ప్రేమను అత్యంత మార్మికంగా, అతి సున్నితంగా వివరించేందుకు నాయకుడు పాడేపాట కోసం భీమ్ పలాసి రాగాన్ని ఎన్నుకున్నాడు ఎస్డీ బర్మన్. పాటలో వాయిద్యాలు కూడా గాయకుడి స్వరానికి ఒదిగి, అత్యంత సున్నితమైన భావాలను ఉద్దీపింపచేస్తాయి.

ఆ కాలంలో ఎస్డీ బర్మన్ మహమ్మద్ రఫీ స్వరం వైపు అధికంగా మొగ్గు చూపాడు. దాంతో కాలాబజార్‌లోని పాటలన్నీ మహమ్మద్ రఫీనే పాడాడు. మహమ్మద్ రఫీ గాన సంవిధానం గురించి ఎంత చెప్పినా తక్కువే. పదాలు కూడా సరైనవి దొరకటం కష్టం. అతడి గొంతు ఒక అద్భుతమైన నటుడు. నటుడు ఎలాగయితే ముఖ కవళికలతో, శరీర కదలికలతో పలుభావనలను వ్యక్తపరుస్తాడో, అలాగే రఫీ తన స్వరంతో నటిస్తాడు. పలురకాల భావాలను అచ్చెరువు గొలిపే రీతిలో పలికిస్తాడు. శ్రోతల ఎదలను స్పందింపచేస్తాడు. గొంతు మార్చి మిమిక్రీ చేసినట్టుండదు కానీ ప్రతి హీరోకూ ఆ నాయకుడి విగ్రహమే స్ఫురించే రీతిలో, ఆ నాయకుడి నటనను అనుసరించి పాడినట్టు పాడతాడు. పాటలోని ఒక్కో పదాన్ని దాని లోలోతుల్లోని భావాలను అనుభవించి పాడినట్టు పాడతాడు. ఏడు స్వరాలు అనంతమైన రాగాలను సృజించినట్టు ఒక్క రఫీ స్వరం మానవ సంవేదనలను, అన్నిటినీ ప్రదర్శిస్తుంది. ఒక్కో పదాన్ని అత్యంత అర్థవంతంగా, విశిష్టంగా పలుకుతుంది అతని స్వరం.

**ఖోయా ఖోయా చాంద్, ఖులా ఆస్మాన్**
**ఆఖోమ్మే సారీరాత్ జాయేగీ,**
**తుం కో భీ కైసీ నీంద్ ఆయేగీ**

చాలా సరళమైన పదాలు, సరళమైన భావం. మహమ్మద్ రఫీ గొంతులో రొమాన్స్ పరవళ్లు తొక్కుతూంటుంది. రఫీ 'చాంద్' అన్న పదాన్ని పలికే విధానాన్ని గమనించండి. 'ఆస్మాన్' అనటాన్ని వినండి. ఒకరకమైన మత్తు కలుగుతుంది. వెన్నెలను, ఆకాశాన్ని చూపుతు నాయికను అభ్యర్ధిస్తున్నట్టుంటుంది. 'ఆఖోమే సారీ రాత్' అని ఎంత మత్తుగా అంటాడో 'తుం కోభీ' అన్నప్పుడు అంత చిలిపిగా ఉంటుంది. సున్నితంగా అభ్యర్ధిస్తున్నట్టు, 'అప్పుడే నిద్రనా?' అని ఆశ్చర్యపోతున్నట్టు ధ్వనిస్తుంది. జాయేగీ అన్నప్పుడు ప్రతిసారీ గొంతులో ఒక జీర ధ్వనిస్తుంది. పాటలో భావాన్ని బట్టి జీర అర్ధం మారుతుంది. ఒక సారి ఉత్సాహం, ఒక సారి ఉత్తేజం, ఒక సారి నిస్పృహ..ఇలా..అలాగే సారీరాత్ అనటంలో కూడా ఆనందం, ఉత్సాహం, నిరాశ నిస్పృహ లు సారీతాత్ ను పలికిన విధానం, సందర్భాన్ని బట్టి సాగ్దీసిన విధానంలో తెలిసిపోతుంది. ఇలా ఒకో పదం ఒకోరకమైన భావాన్ని స్ఫురింపచేస్తూ పాడటం ఒక్క రఫీకే సాధ్యం. అతడు పాటను అనుభవిస్తున్నాడు. నటిస్తున్నాడు. తన అనుభవాన్ని నటనద్వారా ఎదుటి వ్యక్తి హృదయంలో అనుభూతికి తెస్తున్నాడు.

ఇక్కడ ఈ పాటను బీంపలాసి రాగంలో రూపొందించటంలోని చమత్కారాన్ని చెప్పుకోవాల్సి ఉంటుంది. ఈ రాగానికి ఆరంభంలోని ఆలాపన చాలా ప్రాధాన్యం వహిస్తుంది. 'బీం పలాసి' రాగంలో రూపొందిన పాటలను గమనించండి. రాగం ఆలాపన లేకుండా పాటను ఊహించటం కష్టమౌతుంది. 'ఖోయా ఖోయా చాంద్' అంటూ ఆరంభిస్తే ఏదో లోపం అనిపిస్తుంది. 'ఒహోహోహో' అంటూ ఆరంభిస్తేనే సంతృప్తి కలుగుతుంది. పాట మధ్యలో 'ఓహో' అని అందుకుంటేనే అందంగా అనిపిస్తుంది. 'అనార్కలి ' సినిమాలో 'యెజిందగీ ఉసీకి హై' పాట ఆరంభంలోని 'ఆలాపన' లేకపోతే పాట నిండుగా అనిపించదు. ఆలాపన లేకున్నా ఆరంభ సంగీతం ఆ పని చేస్తుంది. ఒక్కసారి పాట ఆరంభమయిన తరువాత పాట అలల్లాగా ఎగసి పడుతూంటుంది. ఈ ఆరోహణ, అవరోహణలు పాటకు అందం తెస్తాయి. ఇక ఆపై వాటికి ప్రాణం పోయటం గాయకుడి పని. 'చాంద్ ' 'ఆస్మాన్' అన్న పదాలను రఫీ పలికిన తీరు గమనిస్తే గాయకుడు పాటకు ప్రాణం పోయటం తెలుస్తుంది. 'ఆఖోమ్మే ' అన్నప్పటి మత్తు 'సారీ రాత్ ' అనటంలో రాత్రి వైశాల్యం, జాయేగీ అనటంలో ఆనందం, ఇన్ని రకాల భావాలను వెంట వెంటనే అనుభవిచటం పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తుంది.

ఇక్కడ చిత్రీకరణ గురించి చెప్పాల్సి ఉంటుంది. పాట ఆరంభంలో నాయిక వహీదా రహమాన్ వీపు కెమేరా వైపుంటుంది. దేవ్ ఆనంద్ కెమేరా వైపు ఉంటాడు. 'ఒహోహో' అంటూ రిథమిక్‌గా వహీదాను చూస్తూ వెనక్కు వెళ్తాడు. అతడి దృష్టి వహీదా నుంచి కదలదు. 'ఖోయా ఖోయా చాంద్' అనేసరికి దృశ్యం మారుతుంది. నాయకుడి నీడలో సిల్వీటెలో ఉంటాడు. ఆకాశంలో వెన్నెల తళతళలాడుతూంటుంది. తెల్లటి మేఘాలు అక్కడక్కడా అందంగా ఉంటాయి. నల్లటి చెట్లు ఆకారాలు కనిపిస్తూ ఒక పెయింటింగ్ గీసినట్టుంటాయి. ఇది వెంటనే ఒక ఆలోచన కలిగిస్తుంది. ఇక్కడ నాయిక 'చాంద్ '. నాయకుడు 'ఆస్మాన్' ప్రకృతి, పురుషుడు. వెన్నెల నిశ్శబ్దంగా ఉంటుంది. మెల్లిగా కదులుతుంది. పురుషుడు స్థిరంగా ఉండడు. నిత్య పరిణామ శీలి. అందుకే పాటలో దేవ్ ఆనంద్ స్థిరంగా ఉండడు. కదులుతూనే ఉంటాడు. కెమెరా అతడిని అనుసరిస్తూనే ఉంటూంది. అతని వేగాన్ని అందుకుంటూ పరుగిడుతూంటుంది. సాధారణంగా జంతువులలో స్త్రీని ఆకర్షించేందుకు మగజంతువు నానా పాట్లు పడుతుంది నృత్యం చేస్తుంది. పురివిప్పుకుని ఆడుతుంది. ఈ పాటలో దేవ్ ఆనంద్ అదే చేస్తున్నాడు. నాయిక ప్రశాంతంగా సరస్సు ఒడ్డున కాళ్ళూపుతూ కూర్చుంటుంది. నాయకుడు ఆమెను ఆకర్షించాలని నృత్యం చేస్తున్నాడు. పరుగులిడుతున్నాడు. పాటలో నాయకుడు 'ఖోయా ఖోయా చాంద్' అంటున్నాడు. 'ఖోయా' అంటే కోల్పోవటం. ఆలోచనల్లో నిమగమై ఉండటం. 'విశాలమైన ఆకాశంలో ఏదో కోల్పోయినట్టున్న చంద్రుడు' ఆమె ప్రియుడు అక్కడ లేడు. అందుకని ఆమె 'ఖోయా ఖోయా' కానీ ఇక్కడ వెన్నెల ఉంది. విశాలమైన ఆకాశం ఉంది. 'ఇక నిద్ర ఎలా వస్తుంది?' ఆమె ఖోయా ఖోయా. కానీ ఇతడికి ఆమె 'చాంద్' అదీ కథ. మాములుగా పాట వింటే స్ఫురించని భావం చిత్రీకరణలో ప్రస్ఫుటమవుతుంది. 'ఆఖోం మే సారీ రాత్ జానా ' రాత్రంతా కళ్లల్లో గడవటం. అంటే రాత్రంతా మేల్కొని ఉండటం. విశాలమైన ఆకాశం, విషాదంతో ఉన్న జాబిల్లి.. ఒకరినొకరు చూస్తుంటే రాత్రి గడిచిపోతుంది.

మస్తీభరీ హావాజో చలీ
ఖిల్ ఖిల్ గయీ యె దిల్‌కీ కలీ
మన్‌కీ గలీమె హై ఖల్‌బలీ
కె ఉన్‌కొతో బులావో...

నాయకుడు అతి సున్నితంగా తన మానసిక స్థితిని చెప్తున్నాడు. చల్లని, మత్తు నిండిన, అల్లరిగాలి వీస్తోంది. దాంతో అతని హృదయపు మొగ్గ విరిసింది. అతని మనస్సులో సంచలనం రేగింది, ఆమెని పిలవమని. ఆమె దగ్గరలోనే ఉంది. కానీ ఆమెని పిలవాలి. ఎందుకంటే ఆమె మనసు తనది ఔనో కాదో తెలియదు. మనసులో మాట చెప్పిన తరువాత మరో చరణంలో ప్రకృతి 'ఎవరికయినా చెందమని' తనకి సూచిస్తున్నదని చెప్తాడు. అక్కడ ఉన్నది ఆమె, అతనే. ఇంకెవరికి చెందమంటుంది?

**తారె చలే, నజారే చలే,**

**సంగ్ సంగ్ మెరె వొ సారే చలే**

**చారో తరఫ్ ఇషారే చలే**

**కిసీకే తో హోజావో...**

చాలా అలతి అలతి పదాలు. తారలు కదులుతున్నాయి. దృశ్యాలు మారిపోతున్నాయి. ఇవన్నీ నా వెంట నడుస్తున్నాయి. అన్నివైపుల నుంచి 'ఎవరో ఒకరిని ప్రేమించమన్న' 'ఎవరో ఒకరికి చెందమన్న' సూచనలు అందుతున్నాయి. పాట బాణీ వింటూ, పదాలను గమనిస్తూ దృశ్యం చూస్తూంటే, రఫీ స్వరంలో మనల్ని అత్యద్భుతమైన రొమాంటిక్ లోకానికి తీసుకుపోతుంది.

**ఐసీ హి రాత్, భీగీసి రాత్,**

**హాథోం హాథ్, హోతే వొ సాథ్**

**కహలేతె ఉన్సే దిల్‌కీ యె బాత్**

**అబ్‌తో న సతావో!**

ఎవరో ఒకరిని ప్రేమించమని సూచనలు అందుతున్నాయి తారలనుంచి, ప్రకృతి దృశ్యాలనుంచి. అతను మాత్రం ఏం చేస్తాడు? ఆమె ఏమో ఎలాంటి భావన ప్రదర్శించకుండా మౌనంగా ఉంది. ఇలాంటి, వెన్నెలలో తడిసిన రాత్రి, ఆమె తన వెంట ఉన్నప్పుడు, ఆమె చేయి తన చేయిలో ఉన్నప్పుడు , తన మనసులో మాట చెప్తాడు. ఇప్పుడు కాదు. ఇప్పుడు ఆమె దూరంగా ఉంది. అందుకని 'ఇప్పుడు సతాయించకు' అంటున్నాడు ప్రకృతితో 'అబ్‌తో నా సతావో' అని రఫీ పలికిన విధానం ఎంత గొప్పగా ఉంటుందంటే గుండెలు పిండేస్తుంది. కెమేరా కదలకుండా ఉంటే దేవ్ కదులుతూంటాడు. కెమేరా కదిలితే దేవ్ నిశ్చలంగా ఉంటాడు. కానీ తెరపై మాత్రం చలనం ఉండి ఎదలో సంచలనం సృష్టిస్తుంది. ఈ సంచలనం నాయకుడిని నిలవనివ్వదు. వేగంగా నడుస్తాడు. నేపథ్య సంగీతం బ్రతిమిలాడుతూన్నట్టుండి, నాయకుడి మానసిక స్థితికి దర్పణం పడుతుంది. చివరికి ఒక నిశ్చయానికి వస్తాడు.

**హం మిట్ చలేహై జిన్‌కే లియే**

**బిన్ కుఛ్ కహె, వొ చుప్ చుప్ రహే**

**కోయీ జరా యె ఉన్సే కహే**

**న ఐసీ ఆజ్ మావో...**

ఎవరి కోసమైతే నేను ప్రాణాలు అర్పించటానికి కూడా సిద్దంగా ఉన్నానో, ఆమె మౌనంగా, ఏమీ మాట్లాడకుండా ఉంది. ఎవరైనా నన్నిలా బాధపెట్టద్దని ఆమెతో చెప్పండి.ఈ చరణం చిత్రీకరణ, దేవ్ ఆనంద్ నటనను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పాట మొత్తం నడుస్తూ, ఊగుతూ, తూలిపోతూ, వాలిపోతూ, సోలిపోతూ, చేతులు ఊపేస్తూ, మనసులోని మాటను నిగూఢంగా చెప్తూ, సూచిస్తూ, ప్రతీకాత్మకంగా చెప్తూ అలసిపోయాడు. నిరాశ కలుగుతోంది. కానీ నిరాశకు తావివ్వడు. తన పరిస్థితికి తనపై జాలి. అంతలోనే వేరే ఎవరినో ప్రేమిస్తున్న అమ్మాయి వెంట పడుతూ తపిస్తున్నానన్న గ్రహింపుతో తన పరిస్థితికి నవ్వు.. కానీ మంచు పర్వతంలా ఉన్న ఆమెని కరిగించాలన్న తపన,

అందని జాబిల్లిని అందుకోవాలన్న ఆశ.. చివరికి నిస్పృహ. ఒకటా, రెండా, శైలేంద్ర తన పదాలలో ఎన్నెన్ని భావనలు పొదిగాడో, తన బాణీద్వారా. ఎస్డీ బర్మన్ ఇంకెన్ని భావనలను ప్రస్ఫుటం చేశాడో, తన స్వరం ద్వారా రఫీ మరెన్ని భావనలను చిలికించాడో, వాటన్నిటినీ దేవ్ ఆనంద్ అభినయిస్తూంటే, విజయ్ ఆనంద్, రాత్రా కెమెరాతో వాటన్నిటికీ మరిన్ని భావ్నాలు జోడించి తెరపై ప్రదర్శించి ప్రేక్షకులకు అందించారు.

'హం మిట్ చలే జిన్‌కే లియే'లో రఫీ ప్రతి పదంలో ప్రత్యేకంగా ఒలికించిన భావాలు దేవ్ ఆనంద్ ముఖంపై కనిపిస్తాయి. జిన్‌కే లియే అని దీర్ఘం తీసేసరికి, ఒక రకమైన నిస్పృహ, ఆపై తన పరిస్థితిలోని హాస్యం గ్రహింపుకు వచ్చిన చిరునవ్వు, లాభం లేదన్న ఆలోచన. కూర్చుండిపోతాడు నవ్వుతూ. అద్భుతం. కొన్ని సెకన్లలో గుండెను కుదిపే ఎన్నెన్ని భావాలు. ఎలాంటి కళాకారులు వారు. ఇంత అత్యద్భుతమైన కళాప్రదర్శనను చూసి ఆనందిస్తున్న మనమెంత అదృష్టవంతులం.

రెండోసారి మళ్ళీ 'హం మిట్ చలే ' అనేటప్పటికి రఫీ పదాలు పలికే తీరు మారిపోతుంది. దృశ్యం మారిపోతుంది. వెన్నెలలో మెరుస్తున్న నీటి వొడ్డున నిశ్చలంగా కూర్చున్న నాయిక కనిపిస్తుంది. ఎవరికోసం నాయకుడు తపిస్తున్నాడో స్పష్టం. తరువాత దేవ్ ఆనంద్ ముఖంలో ఓ రకమైన పట్టుదల, తెగింపు, ఫిర్యాదులు కనిపిస్తాయి. రఫీ స్వరంలో అవి ధ్వనిస్తాయి. కెమేరా కూడా ఫిర్యాదు చేస్తున్నట్టు కదులుతుంది. 'ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంది' అనేటప్పుడు నీటివైపు చూస్తున్న నాయికను పక్కనుంచి చూపిస్తాడు. నేపథ్యంలో ఆకాశం నిండి ఉంటుంది. తెల్లటి మేఘాలుంటాయి ఆమె వదనం వెనుక. ఆమె ఆకాశంలో జాబిల్లి. ఆకాశం అతడి హృదయం. ఆమె వదనంలో ఎలాంటి భావాలుండవు. అత్యద్భుతమైన conception. ఎంత గొప్ప సృజన. ఒక పెయింటింగ్ వేసినట్టుంటుంది. అక్కడ నాయిక కనిపించదు. సున్నిత పురుష హృదయంలో వెన్నెల కురిపిస్తున్న జాబిలి కనిపిస్తుంది. ఆమె మనస్సు inscrutable , ఎవరికీ అర్థంకాదు. పురుషుడు బయటపడిపోతాడు. స్త్రీ హృదయలోతు ఎవరూ తెలుసుకొలేరు. ఒక మామూలు కమర్షియల్ సినిమాగా కొట్టివేసే సినిమాలో ఒక సెకను దృశ్యంకోసం ఎంతెంతగా ఆలోచించి అత్యద్భుతంగా సృజించారు ఆనాటి కళాకారులు అనిపిస్తుంది. మనకు జీవితాంతం తరగని సున్నిత భావాల ఆనందాల గనులు అందించారు వారు. 'కోయీ జరా ఉన్సే కహే ' దాకా వహీదా నిశ్చలంగా కనిపిస్తుంది. 'న ఐసే అజ్మావో ' అంటున్నప్పుడు దేవ్ కనిపిస్తాడు. తరువాతంతా లాంగ్ షాట్‌లో వెన్నెలతో తడిసిన ప్రకృతి. చివరికి 'ఖోయా ఖోయా చాంద్' అంటూ పాట ముగిసే సమయానికి హీరో అభ్యర్ధనల ప్రభావం ఏమాత్రంలేని నిశ్చల విగ్రహంలా నాయిక కనిపిస్తుంది.

ఒక మూడు నాలుగు నిమిషాల పాటలో అనేకానేక భావాల తుఫానులో ఉక్కిరి బిక్కిరి అవుతాం. అత్యంత సులభంగా అందరూ పాడుకుని అనుభవించే ఫాట. సులభమైన పదాలు. పైపైన అలలే సముద్రం అనుకునేవారికి అంతే. కానీ లోతుల్లోకి దిగితే అనంతమైన ఆనందాలు, అద్భుతమైన అనుభవాలు. ఇది ఒక నిద్రరాని తాత్రి పాడుకునే ఉత్సాహవంతమైన గీతం.

అయితే ఆ కాలంలో రాత్రిళ్లు షూటింగ్ చేయటం కష్టంగా ఉండేది. అందుకని పండు వెన్నెల పాటలను మిట్ట మధ్యాహ్నం షూట్ చేసేవారు. 'ల్యాబ్'లో మధ్యాహ్నం వెలుతురు తీవ్రతను వెన్నెల రాత్రి భావన కలిగే వరకూ తగ్గించేవారు. సినిమా హాలులో రాత్రిపూటలాగా అనిపించేది. ఇది సినిమా మ్యాజిక్. ఆనాటి కళాకారులు తాము మ్యూజిక్ సృష్టిస్తున్నామని తెలుసు. ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నామనీ తెలుసు. అందుకే ఈ పాట నాలుగు చరణాలు అత్యంత సృజనాత్మకంగా చిత్రీకరించారు. మొదటి చరణంలో నాయకుడు 'ప్రకృతి ఆమెని పిలవమంటోందంటాడు. రెండవ చరణంలో ప్రకృతి ఎవరినైనా ప్రేమించమంటున్నదంటాడు. మూడవ చరణంలో ఆమె దగ్గర ఉంటే చేతిలో చెయ్యి వేసి మనసులోమాట చెప్పేస్తానంటాడు. చివరి చరణంలో ఇలా మౌనంతో నన్ను పరీక్షించద్దంటున్నాడు.ఒక్క పాటలో క్రమబద్ధంగా ఒక మనిషి మనసులోని భావనల పరిణామ క్రమాన్ని ప్రదర్శించాడు శైలేంద్ర. అత్యద్భుతమైన గేయ రచనా సంవిధానం ఇది.

ఈ పాట గొప్పతనానికి ఏ ఒక్క కళాకారుడినో బాధ్యుడు అనలేము. ఇది అత్యద్భుతమైన కళాకారుల సమిష్టి సృజన ఫలితం. వారి ప్రతిభ వల్ల, తమ ప్రతిభ పట్ల ఉన్న గౌరవం, అవగాహన, బాధ్యతలవల్ల వారు ఇలాంటి అమరమైన పాటలను సృజించారు. ఈనాటికీ మనం ఆనందిస్తున్నాం. అనుభవిస్తున్నాం. భవిష్యత్తు తరాలూ ఆనందిస్తాయి. అసలైన కళాసృష్టికి మరణం లేదు. అందుకు నిదర్శనం 'ఖోయా ఖోయా చాంద్'

## (వచ్చే నెల మరిన్ని రాత్రివేళ పాటలతో..)

Post your comments